ప్రజాసేవకుడు కాళాస్త్రి

ఈ కథకాని కథలోని కథానాయకుని పరిచయం చేసే బాధ్యతను అత్యంత జాగ్రత్తగా నిర్వర్తించవలసిన కారణంగా ప్రత్యక్షరం లోనూ ప్రస్ఫుటించే భావాలకూ సమాజంలోని పోకడలకూ పోలికలు తప్పనిసరి కావలసి రావడం కర్మగాదు ఖర్మ అనుకోవడం ఎంతో మంచిది.

ఇంతకూ ఆయన పేరు కాళాస్త్రి. కాళ+హస్తి కాళాస్తియై చివరికి కాళాస్త్రిగా రూపొందినది. ఈ పేరు నిట్లా ప్రజలు ఇస్త్రీ చేసి వేయడం కాళాస్త్రి దురదృష్టం. ఇది ప్రజారాజ్యం కనుక ప్రజల భావాలకూ ఆలోచనలకూ చేతలకూ అనుకూలంగా కాళాస్త్రి నడుచుకోవాలని తను సంతకం చేసేటప్పుడు సహితం కాళహస్తికి మారు కాళాస్త్రి అనే సంతకం చేస్తుంటాడు. ఆయన ప్రజాసేవా కార్యక్రమానికిదే నాందీ వాచకం.

కాళాస్త్రి అచ్చంగా తెలుగు చిత్రాలలో బ్రహ్మదేవుని వలె ఉంటాడు. భేదమంతా తలల సంఖ్యలోనే కానీ వాస్తవానికి కాళాస్త్రికి మనిషి కుండవలసినంత కంటే నాలుగు రెట్లెక్కువ అఖండమైన తెలివి తేటలు ఉన్నాయి. అందుకే ఆయన అచిరకాలంలో ప్రఖ్యాతి వహించిన ప్రజాసేవకుడై అమోఘంగా రాణించ గలిగాడు.

కాళాస్త్రి పూర్వగాథ యెవ్వరికీ తెలియదు. తెలియజెయ్యాలనే ప్రయత్నంలో కాళాస్త్రి విఫల మనోరథుడై పోయాడు. ఆయన ఉద్దేశ్యం ప్రకారం 'ప్రజా సేవకుడు కాళాస్త్రి' అనే పతాక శీర్షికతో ఏ స్థానిక పత్రికలోనైనా కనీసం పది వారాల పాటు ఒక చిన్న తుఫాను వలె వ్యాసపరంపర వెలువడాలని, లేదా ఒక జన్మదినోత్సవ కమిటీ వ్యవస్థీకరించబడి అధమం ఐదు వందల పేజీలతోనైనా అందచందమైన అచ్చుతప్పులు లేని మేటరులో ఒక సుందరమైన సావనీరు వెలువడాలని.

ప్రజలలో ఆపాటి విచక్షణా శక్తి లేనందున కాళాస్త్రి కోరిక కోరిక గానే

నిలిచిపోయింది. అయినా ఏ పత్రికా విలేఖరియో స్థానిక పత్రిక ఉప సంపాదకుడో కన్పించినపుడు బలవంతంగా ఆయన్ని కాఫీ హోటలుకు తీసుకెళ్ళి ఒన్‌బైటు అని సర్వరుకు ఆర్డరిచ్చి తన జీవిత గాథను ఆరంభిస్తాడు.

"ఆ రోజుల్లో మీరు బహుశా పుట్టి ఉండరనుకొంటాను. బొంబాయి మెయిల్ని అమాంతం ఆపేశాము. డి.యస్.పి. బంగళాలో ఐదు నాటు బాంబులు పడేశాము. సెంట్రల్ జైల్లో మాతో గంజితాగిన వాళ్ళే గతి పట్టారో తెలుసా..."

ఇట్లా సాగే ఉపన్యాసం నుండి ఆ యెదుటి వాడు ఎంతో ఓపికగా తప్పుకోవడం అసాధ్యం కాగా ఇంతలో ఎవరో తారస పడతారు.

ఆ వచ్చినవాడమాంతం కాళాస్త్రిని కౌగలించుకొంటాడు.

దేశానికంతా రైతు కామధేనువు వంటి వాడైతే, రైతుకు కాళాస్త్రి కల్పవృక్షమవుతాడు.

చింతకాయలపెంట- ఎలగమాను మిట్ట - ఎలుంగొడ్లపల్లె, పూరేళ్ళగుట్ట - చిలకల పాలెం- జెర్రిపోతులోళ్ళూరు, తాటిమాన్ల పెంట కొట్టే వాళ్ళ కండిగె పరిసరాల గ్రామాలు సుమారు అరవైదాకా కాళాస్త్రి కనుసన్నల్లో మెలిగే జన పదాలు.

కాళాస్త్రి నివాసం చిలకల పాళెం. ప్రస్తుత దేశకాల పరిస్థితుల ప్రభావాను గుణ్యంగా కారణమేదో చెప్పడం కర్తవ్యమైనా చెప్పక తప్పుకోవడమే ధన్యత్వం కనుక ఎలా సంపాదించారో కానీ ఆయనకక్కడ పదెకరాల పొలం ఉంది.

ఆరు వందల ఆవులు మేసే ఆ అడవి పురంబోకును కాళాస్త్రి పట్టా చేసుకొన్నాడు. అంటే ఆ సుక్షేత్రానికి రాజాధిరాజుగా పట్టాభిషిక్తుడైనాడు.

ఎరువుల సారాన్ని నిలవ చేసే పథకం కింద -

ఏడు వందలు రొఖ్ఖం	700-00
నేలను చదును చేసే స్కీము క్రింద	1000-00
మామిడి మొక్కలు ఇత్యాది ఫలవృక్షముల పెంపకమనే పథకంతో	2000-00
బావి సబ్సిడీ	750-00
మరో బావికి ఋణం	1750-00
ఇంజనులోను	2000-00
విత్తనాలకు అప్పు	1250-00

రసాయనికపుటెరువులకు గాను అప్పు	550-00
ఎద్దులు పట్టుటకు అప్పు క్రింద	960-00
పండిన ధాన్యం మీద అప్పు	1000-00
కో ఆపరేటివ్ సొసైటీలో షేరు కట్టి భూమిని చూపి	3000-00
వెరసి మొత్తము	14,960-00

అక్షరాల పదునాలుగువేలా తొమ్మిది వందల అరవై రూపాయలు ప్రభుత్వం నుండి సంపాదించాడు కాళాస్త్రి. ఆరేండ్ల వ్యవధిలో ఇంత గొప్ప సుక్షేత్రాధిపతియై అంతకంటే పదిరెట్ల ఆదాయాన్ని సంపాదించిన వాడీ ప్రపంచంలో ఉండడనీ ఉండడానికి వీలుకాదని అది అసంభవమని ఆ ప్రాంతీయ ప్రజానీకం వేనోళ్ళతో చాటుతూ ఉంటారు.

కాళాస్త్రి ఎంత ఘటికుడో ఎవ్వరికీ తెలియదు. తెలియని రహస్యాలు ఆయన జీవితంలో అసంఖ్యాకాలు.

ఆ మధ్య యేదో ఉప్పుడు బియ్యం కాదు దంపుడు బియ్యం పరిశ్రమ క్రింద అమాంతం ఒక్కసారిగా ఐదువేలు వచ్చిందంటారు.

ఇట్లా భూమి దున్నకనే, - ఎరువులు వెయ్యకనే, - బావులు త్రవ్వకనే, - చెట్లు పెట్టకనే, ఎడ్లు పట్టకనే, మొలకలు పుట్టకనే పచ్చి బియ్యం కాదు కాదు దంపుడు బియ్యం దంచకనే ఇరవైవేల నార్జించిన ఈ విశ్వవిఖ్యాత పురుషుడు చిలకలపాళెంలో తలలో నాలుక వంటివాడు.

ఆ ఊళ్ళో ఆయన సహాయం పొందని వారు అరుదు.

అల్లం చిన రామయ్య కూతురు పెండ్లికెదిగింది. ఆ పిల్లకు కన్ను మెల్ల. తెల్లగడ్డ చింపిరయ్య కొడుకు జానకయ్య రత్నంలాంటి కుర్రాడైనా ఐదువేలు కట్నం ఇవ్వంది పెళ్లాడనన్నాడు. ఆ సందర్భంలో కాళాస్త్రి కాలికి బలపం కట్టుకొని, చెరువులో చేపలు పెంచే స్కీము క్రింద - చేల్లో కోళ్ళు పెంచే పథకం క్రింద, - ఆలమీద కోడెను పెంచే ఆమాంబాపతు పద్దు క్రింద ఆరువేలు సంపాదించి అందులో ఒక్క రెండు వేలు మాత్రం తాను పుచ్చుకొన్నాడు. అతని త్యాగాన్ని గురించి అల్లం చిన రామయ్య అడవి పల్లెలంతా చాటించాడంటే ఎందుకు చాటించడు?

కాళాస్త్రి ఎప్పుడూ ఎల్లవేళలా మల్లెపువ్వు లాంటి పంచలే కడతాడు. చందనం రంగు జుబ్బాలన్నా, - సరిగ వచ్చిన అంగవస్త్రాలన్నా అతని కమితమైనప్రీతి.

చిలకల పాళానికి బుంగలగుంటకు పదిమైళ్ళు. బుంగలగుంట తాలూకా కేంద్రం. అక్కడ డిప్టీ కలెక్టరుగారి కార్యాలయం కూడా వుంది. ఆ కార్యాలయానికి కెదురుగా ఒక పార్కు. ఆ పార్కులో ఒక సిమెంటు తిన్నె.

కాళాస్త్రిని పట్నంలో చూడాలంటే ఆ తిన్నె మీదనే చూడవచ్చు. అక్కడాయన అసంఖ్యాకమైన అర్జీలనూ – పిటీషన్లనూ సృష్టిస్తూ ఉంటాడు. ఎప్పుడూ ఆయన చుట్టూ పదిమంది తప్పకుండా ఉంటారు. చిలకపాళెం పరిసరాల ప్రజానీకంలో ఎవరికేది కావలసి వచ్చినా ఆయనే దిక్కు.

ఆయన ఆపద్బాంధవుడు. ఎంతటి చిక్కునైనా చిటికెలో తీర్చి వేయగల ఘటనాఘటన సమర్థుడు.

కొట్టేవాళ్ళ కండిగెలో కంపల చెంగయ్య ఒక సందర్భంలో పెద్ద ప్రమాదంలో పడిపోయాడు. ఆయన ఇంటిని అకస్మాత్తుగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గారు సోదా చేశారు. ఎద్దులకని లోను తీశాడు గానీ ఆ డబ్బుతో ఆయన సారా వ్యాపారం ఆరంభించాడు. ఇదెట్లాగో పసిగట్టిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కంపల చెంగయ్యను గట్టిగా పట్టుకొన్నాడు.

అతడెల్లాగో తప్పించుకొని పెరటి దారిన బుంగల గుంటకు పలాయనుడై పార్కులో సిమెంటు తిన్నెపై ఆశీనుడై వున్న కాళాస్త్రి పాదాలపై వ్రాలి అలనాటి గయునివలె శరణాగతుడైనాడు.

ఒకే ఒక గంట కాలంలో టాక్సీలో వెళ్ళి కాళాస్త్రి ఆ సమస్యను పరిష్కారం చేసి పారేశాడు.

"ఏముంది అందులో ఈ మాత్రానికే ఇట్లా బెదురుతావేం" అన్నాడు కాళాస్త్రి అంతా ముగిశాక.

వెల్లుల్లిపాళెం చిక్కాలయ్య ఎద్దులు బలే మంచివి. చేతులెత్తున్నాయి. బొల్లికొండ పరసలో ఎనమనూట యాభై ఐదిచ్చి ఆ వారం రోజుల క్రితమే పట్టుకొచ్చాడతడు. ఆ ఎద్దుల్ని కాళాస్త్రి పట్టుకొచ్చి కంపల చెంగయ్య పశువుల కొట్టంలోని గాట్లో కట్టేసి చావిడికాడ కూచున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ని బలవంతాన పిలుచుకువచ్చి చూపించడమే గాదు రిపోర్టు కూడా రాయించేశాడు.

ఇట్లా పీకల మీదికి వచ్చిన కొండంత ప్రమాదాలను గోటితో చిమ్మి వేసే బ్రహ్మాండమైన ప్రజ్ఞా పాటవములున్న కాళాస్త్రి ఒకనాడు ఏదో పనిమీద ఆస్పత్రికి వెళ్ళాడు.

బుంగలగుంటలో ఆస్పత్రిని భూలోక నరకమంటారు. అందులో ఉన్న వాళ్ళందరూ యమదూతలని సాక్షాత్తు డాక్టరుగారు యమధర్మరాజనీ - అక్కడి జనాల నమ్మకం. అందుకే అందులోకి ఎవ్వరూ వెళ్ళక ఆ యాస్పత్రి చుట్టూ బోర్డులు కట్టుకొన్న వందలాది నేటివ్ డాక్టర్ల వద్ద వేలాది ఇంజక్షన్లు తీసుకొని లక్షలాది రూపాయలను ఖర్చు పెడుతూ, కోట్లాది పన్నులు కడుతున్నా ఈ గవర్నమెంటు మా మొరాలకించదేం అంటూ అఘోరిస్తుంటారు.

కాళాస్త్రిని డాక్టరుగారు చూచిందే మందు కావాలేమోనని

"మీ పేరేమి" అన్నాడు.

"కాళాస్త్రి" అని సమాధానం చెప్పాడు కాళాస్త్రి.

"నే నడిగింది నీ పేరయ్యా"

"కాళాస్త్రి"

"వూరుపేరు కాదు. నీ పేరు చెప్పవయ్యా అంటే...."

కాళాస్త్రికి కోపం వచ్చింది. అతనికి కోపం వస్తే ఏమీ మాట్లాడడు. ఆ క్షణంలోనే అతని భరతం పట్టించడమెట్లా అని ఆలోచిస్తాడు.

అంతే... గిరుక్కుమని వెనక్కి తిరిగి మినప రామయ్యశెట్టి కొట్లో ఒకటిన్నర రీము కాగితం కొన్నాడు. జమాజమా ప్రెస్సులో ఇచ్చి ఒకే రకం పిటిషన్లు నాలుగు వేలు అచ్చేసి ఒక్కొక్క పిటిషన్లో వంద సంతకాలు (వేలి ముద్రలతో సహా) చేయించి ఆ కట్టల్ని ఒకే బంగీగా కట్టించి సరాసరి రాజధానిలోని గౌరవనీయుల పేర పార్సల్ చెయ్యించాడు.

ఇంతపనీ జరగడానికి మూడు రోజులే సరిపోయినా ఆ డాక్టరు గారికి ట్రాన్స్ఫర్ మాత్రము మూడు మాసాలకు వచ్చింది.

అను దినమూ, అనుక్షణమూ ఉత్పన్నమయ్యే ప్రజల సమస్యలను పరిష్కరించాలంటే తనకొక చిన్న జీపు కారుండాలని తోచింది కాళాస్త్రికి.

"ఈ బీడీవోలు, జీడీవోలు, డీఇవోలు, యస్ఈవోలు, ఆర్డీవోలు, ఆర్టీవోలు, ఇట్లా జీపులలో పల్లెమీదికి దాడి చేయకుంటే నాబోటి వాడికో జీపెందుకియ్యదీ ప్రభుత్వం" అని చాలా మందితో అన్నాడు కాళాస్త్రి. కాళాస్త్రికి జీపు కావలసిన మాట నిజమే. దాని సంపాదించడం యెట్లా?

అప్పుడప్పుడే జనరల్ ఎన్నికలు వస్తున్నవి. కాళాస్త్రికి తళుక్కున మెరుపు లాంటి ఆలోచన తట్టింది. "బలే మంచి సమయము మించినన్ దొరకదు."

అవును. దొరకుతుందా మరి అలాంటి సమయం. కేవలం ఓటున్న మూగవాడే మూడు రూపాయల నుండి ముప్పై రూపాయలార్జించే ఆ తరుణంలో కాళాస్త్రి వంటి అఖండ మేధా సంపన్నుడు ఐదు వేలైనా ఆర్జించలేడా?

ఐనా పెట్టుబడి కావాలి? పెట్టుబడి లేనిదే ఏ వ్యాపారమూ సాగదు. కనుకనే కాళాస్త్రి పెట్టుబడి దారులను గట్టిగా విమర్శిస్తుంటాడు. కార్మికుల కోసం కడవలాదిగా కన్నీరు కారుస్తుంటాడు.

రెండు వందలా యాభై చెల్లించి నామినేషన్ వేశాడు.

జమాజమా ప్రెస్సులో కూచొని మహాద్భుతమైన ఒక కరపత్రాన్ని నాలుగు వేలా నాలుగువందల నలభై నాలుగు పదాలతో రచించాడు.

తన ఫోటో బ్లాకు ఎంతో వినయంగా ప్రజలముందు వినమ్రుడై నమస్కృతులు సమర్పిస్తున్నట్టుగా మొదటి పేజీ – ,

ఆ వెనుక తానెవరు? తన జీవితాశయం నేటి పరిస్థితులు–, ప్రభుత్వం దుబారా ఖర్చులు, పార్టీల అనిశ్చిత పరిస్థితులు – తాను గెలువబోయే విధానము – ప్రజల సంసిద్ధత – గెలువగనే తాను తలపెట్టనున్న నూట నలభై నాలుగు పథకాలలోని ప్రధాన సారాంశము.

ఈ కరపత్రాలు విడుదల కాగానే గుమ్మడికాయల సూరయ్యకు ముచ్చెమటలు పోశాయి. పూర్తిగా చదవగానే ఆయన సొమ్మసిల్లిపడి పోయాడు.

ఈ విపత్కర పరిస్థితిని దాటి పోటీ నుండి కాళాస్త్రిని విరమింప చెయ్యడానికి సూరయ్య విశ్వప్రయత్నాలు చెయ్యగా చెయ్యగా నామినేషన్లు ఉపసంహరించు కోవడానికి గడువు సరిగ్గా ఏడు నిమిషాలు ఉందనగా ఫలించినది.

ఎన్నికల ప్రచారానికి సూరయ్య కొన్న కొత్త జీపు కాళాస్త్రి స్వాధీనం చేయబడినది. ఆ జీపులో సూరయ్యకోసం ప్రచారం చేస్తున్నట్లు కాళాస్త్రి నటిస్తూ సూర్యకు పోటీగా ఉన్న పెసరట్ల ఆనందయ్య వద్ద రెండువేలు తీసుకొని అతనికే సాయం చేశాడంటారు. నిజానిజాలు దేవుడికే తెలియాలి గానీ ఆ ఎన్నికల్లో సూరయ్యా గెలువలేదు. ఆనందయ్యా గెలువలేదు. గెలిచి నాయన ఇంకో ఘటికుడు. ఆయన పేరు ఈ క్షణాన గుర్తుకు రాకపోవడం కాళాస్త్రి విస్తృతమైన ప్రభావమే కారణమని అంగీకరించక తప్పదం లేదు.

ఏదేమైతేనేం కాళాస్త్రి జీపును సంపాదించాడు. అది రోడ్డు వెంబడి దుమ్మును రేపుతూ పోతుంటే బాటసారులు "అతడే అతడే కాళాస్త్రి. పోయిన

దఫా చాలుకొన్నాడు కానీ ఈమారు నిలిస్తే అతడికి ఓట్లతో పాటు నోట్లు కూడా వేస్తారు" అని అంటూ ఉంటారు.

కాళాస్త్రి బాగా స్థిరపడిపోయిన ప్రజాసేవకుడు. నాయకుడనడం అతనికి ఇష్టం లేదు. సేవకుడంటేనే అతడికి చాలా ఇష్టం.

ఉన్నట్టుండి కాళాస్త్రికి మరో సిరి పట్టుకొన్నది. సిరి ఆయన్ని పట్టుకొన్నదో లేక ఆయనే సిరిని వెదకి కనుగొని పట్టుకొన్నాడో చెప్పడం కష్టం. అక్కడి జనాలంతా ఆయన త్యాగాన్ని ఆదిశేషునికే మాత్రం తీసిపోని విధంగా అభివర్ణిస్తారు.

చిలకల పాళెం నుండి బుంగల గుంటకు పదిమైళ్ళు గదా. ఈ బాటకిరు వైపులా ఉండే మద్ది, నేరేడు, చింత, వేప, కానుగ, తాటి, రాగి, మర్రి ఇత్యాది వృక్షములన్నీ రాత్రికి రాత్రే అదృశ్యమై పోయాయి. ఒక్క రాత్రిలో కాకపోయినా ఒక్క అర్ధ సంవత్సరంలోగా ఈ పథకం పూర్తయిపోయినది. ఆ రోడ్లో వెడుతుంటే వనకాంతల వలె పచ్చగా ఆశీర్వదిస్తుండిన వృక్షాలు తలలు బోడులై, మ్రోడులై, మొక్కలై, చివరికి క్రమక్రమంగా కూకటి వ్రేళ్ళతో సహా అదృశ్యమైపోయినవి.

ఈ పథకం పూర్తికాగానే కాళాస్త్రి బుంగల గుంట స్థానికాధికారులను, ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోస్తూ స్థానిక పత్రికలలో నిరంతరంగా ప్రకటనలిస్తూ వచ్చాడు. అన్నిటినీ సఫా చేయించి అందులో మంచి ఆదాయాన్ని సంపాదించి చివరికా అన్యాయాన్ని చేసిన వారిని దండించాలంటూ కాళాస్త్రి సల్పిన ఆందోళన ఫలితంగా అక్కడి అధికారులు బుంగలగుంట చిలకలపాళెం రోడ్డులో ఆరు బోర్డులు వేశారు.

"రోడ్డు మీద చెట్లు నరుకువారు శిక్షింపబడుదురు."

ఈ చర్యతో రోడ్డులో కొమ్మ పడినా తక్షణం ప్రక్కకు ఈడ్చి ప్రజలక్కడ ఆ కొమ్మలను ముక్కలు చేయడం ఆరంభించారు.

కాళాస్త్రి సంపాదనలో బాగా మిగిలిపోయినా అనుక్షణం ఏదో ఒక మహత్తరమైన బృహత్ప్రణాళికను గురించి ఆలోచిస్తూ ఉంటాడు.

ఇప్పుడాయన బుంగలగుంటలో ఒక బుల్లి మేడను కూడా కొన్నాడు. పార్కులో కూచునే దౌర్భాగ్యం లేదాయనకు.

చిన్నగా సన్నగా నవ్వుతూ ఏదో దీర్ఘంగా ఆలోచించే ఆయన ప్రసన్న వదనాన్ని చూచి గొప్ప గొప్ప న్యాయవాదులే ముగ్ధులై పోతూ ఉంటారు. అంతో ఇంతో పలుకుబడి కల రాజకీయ నాయకులు మనస్సులో ఇష్టం లేకున్నా అత్యంత

మర్యాదగా అతనికి నమస్కారాలర్పిస్తూ ఉంటారు.

అతడే ఆఫీసుకు వెళ్ళినా క్షణాల మీద అతని పని పూర్తయిపోతూ ఉంటుంది. ఇపుడట్లా వెళ్ళే అవసరం కూడా లేదు. ఇటీవలే ఫోను కూడా పెట్టుకొన్నట్లు బుంగలగుంట టెలిఫోను గైడు సాక్ష్యమిస్తున్నది.

అన్నిటికంటే ఆశ్చర్యమేమంటే ఉన్నట్టుండి చక్కెర కరువు వచ్చి బుంగల గుంటే కాదు దేశమంతా అఘోరిస్తుంటే, చేతకాకుండా అల్లల్లాడుతుంటే, కాళాస్త్రి క్షణాల మీద వంద యాభై కిలోలు తెప్పించాడు. "ఇంత చక్కెరే... బ్లాక్ మార్కెట్లోనా" అంటూ తన కళ్ళను తానే నమ్మలేకుండా కళ్ళు నలుము కుంటున్న కంపల చెంగయ్యతో.

"బ్లాక్ మార్కెట్టా. న్యాయంగానే... ఇదో చూడు పెండ్లి పత్రికలు" అంటూ మూడు పత్రికలు ముందుంచాడు.

ఒకటి....

స్వస్తిశ్రీ శోభకృతు నామ సంవత్సరం... సింహ లగ్నమున...

నా కుమారుడు సకలపాణికి కల్లాపేట ఎల్లయ్య కుమార్తె చెంగమ్మకు మంగల చెరువు ఎల్లమ్మ గుడిలో పెండ్లిగాన అందరూ విచ్చేయ ప్రార్థన.

ఇట్లు

కుళ్ళం ఎర్రయ్య.

ఇట్లా ముగ్గురి పేర్లతో మూడు పెండ్లి పత్రికలు, అన్నీ జమా జమా ప్రెస్సులో అచ్చయినవే.

బుంగలగుంట తాశీల్దారుగారు కాళాస్త్రి పంపిన ముగ్గురు మనుషులకూ తలో యాభై కిలోలు శాంక్షన్ చేశారు. అది ఆయన ధర్మం. ఈ దేశానికి పట్టిన కర్మం. కాళాస్త్రి హృదయంలో వున్న మర్మం.

"నాకో నాల్గు కిలోలు" అన్నాడు లొట్టలు వేస్తూ కంపల చెంగయ్య.

"ఊళ్ళో బ్లాక్ మార్కెట్లో కిలో మూడు రూపాయలు. నీకు రెండుం పావలా" అన్నాడు కాళాస్త్రి.

ఎంత మంచివాడు కాళాస్త్రి అనుకొన్నాడు కంపల చెంగయ్య.

నిజానికి కిలో రూపాయి పావలా. ఐనా కార్డుగానీ పర్మిటుగానీ వీటికి తగ్గ సిఫార్సుగానీ ఉండి తీరాలి. అది వీలుకానపుడు బ్లాకులో కిలో మూడు రూపాయలు తగలబెట్టాలి.

అలాంటప్పుడు కాళాస్త్రి కిలో రెండుంబావలాకిప్పిస్తుంటే ఎంత త్యాగం! ఎంత త్యాగం! ఎవరితరము! వర్ణించ నలవియా? వేయి శిరస్సుల శేషునికైనా!

సరిగ్గా ఇలాంటి పదాలతోనే కొన్ని రోజుల క్రిందట కాళాస్త్రి కూతురి పెళ్ళిలో పంచరత్నాలు చదివాడొక అభ్యుదయ రచయిత.

కవి వాక్కు వృధా కాదంటారు. ఎందుకంటే ఎలుంగొడ్డుపల్లె సిగరమాన్ల సుందరయ్యతో సంబంధం కుదుర్చుకోవడం సామాన్యమైన విషయం కాదు. సిగరమాన్ల సుందరయ్యకు మూడు బస్సు రూట్లున్నాయి. ప్రతినిత్యమూ ప్రతి ట్రిప్పుకూ ప్రతి బస్సులో వందా ఇరవై మూడు మందికి తక్కువ లేకుండా ప్రయాణం చేస్తుంటారు. ఈ మూడు పుష్పక విమానాలతో ఎలుంగొడ్ల పల్లె సిగరమాన్ల సుందరయ్య ఎంతటి వాడైనాడంటే ఆ ప్రాంతంలోని అడివిపల్లెల పంచాయతీబోర్డు ప్రెసిడెంట్లలో ముప్పాతిక మందిని కొని సమితి ఎన్నికల్లో సరాసరి కుంభకోణానికి రవాణా చేసి పారేశాడు. సరిగ్గా కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక నాడు మూడు గంటల ఐదు నిమిషాలా ఇరవై ఐదు సెకండ్లకు టూరిస్టు బస్సు ఇరవై ఆరు మంది పంచాయతీ బోర్డు అధ్యక్షులతో డిప్టీ కలెక్టర్ ఆఫీసు ముంగిట సోపానాలను స్పృశిస్తూ నిలచింది.

ఆ దెబ్బతో సిగరమాన్ల సుందరయ్య మనుషులు మరో ఆరు మంది సభ్యులై ఎదుటి వాడికి చావు దెబ్బ తగిలి తానే ఏకగ్రీవంగా ఎన్నికైనాడు.

బుంగలగుంట తాలూకా కేంద్రమైనా ఎలుంగొడ్ల పల్లెలోనే సమితి స్థితి యేర్పడి అక్కడ సుందరయ్య రాజ్యం ఎంతో అందంగా సాగుతున్నది అప్సరసల నృత్యాలతో.

అతని కుమారరత్నం అరవ సినిమాల్లో నాయకుడులాగ గర్జిస్తాడు. కూలీ నాలీ చేసుకొనే పేదా బిక్కికి రత్నమంటే భయం. అతనికే కాళాస్త్రి కుమార్తెను ఇవ్వడానికి నిశ్చయించుకొన్నారు. కట్నం కానుకా లేకుండా జరిగిన ఈ వివాహానికి బ్రహ్మాండమైన పొలిటికల్ బ్యాగ్రౌండ్ ఉందనీ వచ్చే ఎన్నికల్లో కాళాస్త్రి సుందరయ్యా ఏకమై సుందరయ్య కొడుకు రత్నాన్ని యం. యల్. ఏ. గా చేసి పారేస్తారనీ - ప్రస్తుతం దేశంలో ఇలాంటి ఆలోచనలూ -, కార్యాచరణాలు అసంఖ్యాకంగా జరుగుతున్నందున ఇందులో ఆశ్చర్యపడవలసిన విశేషమేమీ లేదని బుంగలగుంట స్థానిక పత్రిక టాంటాం ఒక పతాక శీర్షికను ప్రచురించినది.

ఆ పెండ్లికి హాజరైన అనేకమంది పెద్దల పేర్లను వరుసగా ప్రకటిస్తూ

బుంగలగుంట తాలూకా మొత్తం ఆర్థికంగానూ, సాంఘికంగానూ, రాజకీయం గానూ, విద్యా విషయంగానూ కాళాస్త్రి గుప్పిట్లోకి వచ్చేసిందని ఆ విలేఖరి స్పష్టంగా ఉద్ఘాటించాడు.

అందుకు తగ్గట్టుగానే కాళాస్త్రి ఓం ప్రథమంగా ఎలిమెంటరీ స్కూళ్ళ టీచర్లపై ట్రాన్స్‌ఫర్లనే వజ్రాయుధాన్ని ప్రయోగించాడు. ఈ క్రొత్త వ్యాపారంలో ఆయనకు అనుకొన్నంత మొత్తం అందకపోగా ఈ బండి పంతుళ్లు మూక ఉమ్మడి ప్రచారం మొదలు పెట్టారు.

ఇట్లా కలకాలం నుండి ఆర్జించిన కీర్తి ప్రతిష్టలు నశించిపోవడం తనకే మాత్రం ఇష్టంలేక కాళాస్త్రి తన దృష్టిని తీపి కల్లంగళ్లపైకి మరల్చి చల్ల కదలకుండా కూచున్నాడు.

వాటి పేరు తీపి కల్లంగళ్లైనా అవి అసలు కల్లు పాకలకు ఎందులోనూ తీసిపోవు. ముద్రలు లేని ఈతచెట్ల శిఖల్లో తాటికాయల్లా ముంతలు వ్రేలాడుతుంటే ప్రొద్దు పొయ్యేలోగా ఆ పూటకంటే వేయి చెట్లు నయాపైసలు కన్పిస్తున్నాయి.

ఈనాడు కాళాస్త్రి గారికి తీరికే లేదు. పాపం అర్జీల కోసం గానీ పిటీషన్ల కోసం గానీ జనాలతని దగ్గరికి వెళ్ళడమే మానేశారు. అతడూ అంతే. అవసరమైతే ఏ ఆఫీసర్నయినా ఇంటికి పిలిచి మాట్లాడుకొంటాడు. అంత ముఖ్యమైన పనైతే అధ్యక్షుడు సుందరయ్య అంచెల మీద వెళ్ళివస్తాడు.

మూడు పుష్పక విమానాలు తిరుగుతూ వున్నాయి.

నూరు నీరా అంగళ్ళు జరుగుతూ ఉన్నాయి.

కనుసన్నల్లో కావలసినంత సిబ్బంది ఉండగా కాళాస్త్రి సామాన్య జనం కంటికి దూరం కావడంలో ఆశ్చర్యం లేదు.

అయినా జనాలు మాత్రం అతని దర్శనార్థం రోజూ బారులు దీరి నిలబడతారు. హైస్కూల్లో సీటు కావాలన్నా, ఆస్పత్రిలో చోటు కావాలన్నా అడవిలో ఆకు చీటీ కావాలన్నా సంతలో ఏలంపాట పాడాలన్నా, కాళాస్త్రి సిఫార్సు ఉండక తప్పదు. అసలా మాటకు వస్తే కాళాస్త్రికి తెలియకుండా బుంగల గుంట ప్రాంతంలో చీమ చొరబడ్డానికైనా వీల్లేదు.

కాళాస్త్రి కఠినుడనీ – నిర్దయుడనీ – మహాకుట్రదారుడనీ, – తేనె పూసిన కత్తి అనీ, గోముఖ వ్యాఘ్రం వలె అటు ఉద్యోగులనూ, ఇటు ప్రభుత్వాన్నీ వంచించి, – ప్రజల్ని మోసగించి లక్షలాది పైకాన్ని ఆర్జిస్తున్నాడనీ గిట్టని వాళ్లంటారు.

కానీ చిలకల పాళెంలో, - చింతకాయల పెంటలో, - ఎలుంగొడ్ల పల్లెలో ఎక్కడ విన్నా జనాలు ఏకగ్రీవంగా "అతడు మొనగాడు. అతడా? పులిగదా.... అబ్బో కాళాస్త్రి ఎంత కరుణామయుడనుకొన్నారు....

ఘటికుడు. ఘటికుడు. అతడే లేకుంటే ఈ బస్సులిట్లా నడుస్తాయా? ఈ రోడ్లిట్లా వేస్తారా? ఎక్కడంటే అక్కడ ఎప్పుడంటే అప్పుడు కావలసినన్ని సారా బుడ్లు దొరుకుతాయా? ఆ మాటకు వస్తే ఈ కల్లంగళ్ళు కాదు కాదు నీరా అంగళ్ళు జరిగేవేనే?" అని స్తుతిస్తూ ఉంటారు. సందేహం లేదు. వచ్చే ఎన్నికల్లో వద్దన్నా కాళాస్త్రిని పిలిచి పిలిచీ ఓట్లిస్తారు జనాలు. రత్నాన్ని నిలుపుతారని ఆ టాంటాం పత్రికేదో అవాకులు చవాకులూ వ్రాసింది గానీ అసలు కాళాస్త్రి స్వయంగా ఎన్నికల్లో నిలబడతాడు. అందుకే ఆయన డబ్బును అమితంగా ఆర్జించేస్తున్నారు.

ఎన్నికల్లో గెలవాలంటే నోటిమాటలా, మొదటి ఎన్నికల్లో పాతిక వేలైతే, రెండోసారి యాభైవేలు. మూడోసారి లక్ష. మళ్ళీ నాలుగోసారి రెండు లక్షలు. ఇట్లా వోట్ల ఖరీదు నోట్లు పెరిగిపోతుంటే కాళాస్త్రి వూరుకొంటే ఎట్లా?

ప్రజాసేవలో ఎన్నో తంటాలు పడితేగా ప్రజానాయకుడయ్యేది-, ఆ యోగమే కాళాస్త్రికి పడితే బుంగల గుంట సాక్షాత్తు బంగారు గుంటై పోదూ!

అదే నా ఆశయమంటాడు కాళాస్త్రి పొరబాటున ఏ రాజకీయ నాయకుడైనా కన్పిస్తే.

ఇంత గొప్పవాడైనా కాళాస్త్రి స్థానిక పత్రికా విలేఖరులకు మాత్రం ప్రత్యేకమైన మర్యాద ఇస్తాడు. కాఫీ సిగరెట్ల నుండి కార్లలో యాత్రల వరకూ వారికి మాత్రం స్పెషల్ మార్జిన్!

అందుకోసమేగా వారు కూడా "నిజంగా కరుణామయుడు కాళాస్త్రి" అని అనడం. శంఖులో పోస్తే తీర్థమైనట్లు కవులు గాయకులే అలా అంటే ఇక సామాన్య జనాల దృష్టిలో అతడు సాక్షాత్తు ప్రజా సేవకుడే, కాదనగల వారెవరు?